నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, సోమవారం 14 ఏప్రిల్ 2025 | YADADRI BHUVANAGIRI

రైస్ మిల్లు వద్ద వివాదం

- ధాన్యం కొనుగోలు విషయంలో ఘర్షణ
- రైతులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్13 : ధాన్యం కొనుగోలు విషయంలో మండలంలోని సూర్యతేజ రైస్ మిల్లు వద్ద వివాదం ఏర్పడింది. మిల్లు యజమాని, దళారులు మధ్య ఘర్షణ నెలకొనగా రైతులపై కూడా మిల్లు సిబ్బంది దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మిర్యాలగూడ మండలం పరిధిలోని బాదాలపురం గ్రామానికి చెందిన రైతులు శివనేని నాగరాజు, శివనేని వెంన్న, శివనేని సైదులు ట్రాక్టర్‌లో ధాన్యం లోడు మిల్లుకు తరలిస్తుండగా అధిక ధరకు అమ్మి పెడతానికి కొందరు వారితో మాట్లాడారు. ఆ ధాన్యాన్ని యాద్గార్‌పల్లి గ్రామ శివారులోని సూర్యతేజ రైస్ మిల్లుకు తెచ్చి యాజమాన్యంతో అధిక ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఇప్పుడు తీసుకోలేమని మిల్లు యజమాని పగిడిమర్రి రంగనాథ్ చెప్పడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మిల్లు సిబ్బంది వారిని బయటికి పంపించే సమయంలో ఘర్షణ జరిగింది.

ఈ నేపథ్యంలో ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. రైతులపై దాడి చేసిన మిల్లు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రైతులకు మద్దతుగా బాదాలాపురం గ్రామస్తులు రూరల్‌పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు

రజతోత్సవ సభకు పండుగలా తరలిరావాలి

ప్రతి ఊరి నుంచి వచ్చేలా సిద్ధమవుతున్న ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

- పాదయాత్రలు, సైకిల్, బైక్ ర్యాలీలకు సన్నద్ధం
- పార్టీకి అవసరమైనప్పుడల్లా ఊపిరినందించిన నల్లగొండ జిల్లా
- గత పాలకులు ఎన్ని కుట్రలు చేసినా చెంపపెట్టులా ఉద్యమాలు చేశాం
- రాష్ట్రాన్ని అన్నపూర్ణగా మార్చి దేశానికి అన్నం పెట్టిన ఘనత కేసీఆర్‌దే
- జిల్లా మంత్రుల కమీషన్ల కక్కుర్తితోనే రైతాంగానికి తీరని నష్టం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- నల్లగొండలో రజతోత్సవ సభ బీఆర్ఎస్ నియోజకవర్గ సన్నాహక సమావేశం

నీలగిరి, ఏప్రిల్ 13 : ఈ నెల 27న వరంగల్ నగరంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ప్రజలు పండుగలా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్స్‌లో రజతోత్సవ సభ విజయవంతం కోసం అదివారం నల్లగొండ నియోజకవర్గ సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ సభకు ప్రజలు ఊర్లకు ఊర్లు కదిలి వచ్చి పండుగలా జరిపేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులతోపాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాదయాత్రలు, సైకిల్, బైక్ ర్యాలీలతోపాటు ఎడ్లబండ్లతో వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుంచి అత్యంత తక్కువ కాలంలో ఎక్కువ సభలు పెట్టి విజయవంతం చేయడంలో బీఆర్ఎస్ గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుందన్నారు. పార్టీ అవిర్భావం సమయంలో అప్పటి టీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు చంద్రబాబుతోపాటు సీమాంధ్ర నేతలు ఎన్నో కుట్రలు చేశారని, వాటిన్నింటిని తట్టుకుని నిలబడి ముందుకు సాగిందని చెప్పారు. టీఆర్ఎస్‌ను దెబ్బ తీసేందుకు ముందుగా హైదరాబాద్‌లో ఎన్నికలు, తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టి తెలంగాణ ప్రభావం లేదని చెప్పే కుట్రలు చేశారని గుర్తుం చేశారు. కానీ వాటి తర్వాత నల్లగొండ జిల్లా చరిత్రలో ఏ పార్టీ ఏనాడూ పెట్టని విధంగా మొదటి వారి కోత్సవ సభను కలెక్టరేట్ ఎదుట పెట్టి విజయవంతం చేశామని చెప్పారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తామని చెప్పి మోసం చేస్తే సుమారు 1200 మంది పిల్లలు అత్మబలిదానాలు చేసుకున్నారని అవేదన వ్యక్తం చేశారు. అప్పుడు తెలంగాణ వాదం ఉందని చెప్పడం కోసం సూర్యాపేటలో సభలు పెట్టి విజయవంతం చేయడంతోపాటు ఎన్నో ప్రాంతాల్లో సభలు పెట్టి ఉద్యమంలో నల్లగొండ జిల్లా ఉద్యమాల ఖిల్లా అని నిరుపించామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సమితి అవిర్భావం నుంచి పార్టీకి అవసరమైనప్పుడల్లా ఊపిరినందించి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రం సాధించామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక అన్నమో రామచంద్ర అన్న నల్లగొండ జిల్లాను అన్నపూర్ణగా మార్చి దేశానికి అన్నం పెట్టే స్థాయికి కేసీఆర్ తీసుకెళ్లారని చెప్పారు.

కమీషన్ల కక్కుర్తితోనే రైతులకు అన్యాయం

కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని దద్దమ్మలా మారిందని జగదీశ్‌రెడ్డి అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డివి మాటలు తప్ప చేతలు లేవని ఎద్దేవా చేశారు. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు చేతకాని తనం, కమీషన్ల కక్కుర్తి వల్లే రైతులపై మిల్లర్లు, దళారులు రైతులపై దాడులకు దిగుతున్నారని అన్నారు. మిర్యాలగూడలో మద్దతు ధర అడిగితే మిల్లర్లు, దళారులు కలిసి దాడి చేశారని, దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూర్యాపేటలో మద్దతు ధర రాక ఓ రైతు ధాన్యపు రాశికి నిప్పు పెట్టాడని, 16నెలల కాలంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మండిపడ్డారు. ఇద్దరు మంత్రుల కారణంగా ఎస్ఎల్‌బీసీ శాశ్వతంగా మూసివేసే కుట్ర జరుగుందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసే దమ్ము ప్రభుత్వానికి లేదని, అందులో ప్రమాదం జరిగితే ఇంతవరకు శవాలను బయటకు తీయలేదని విమర్శించారు. నీళ్లు లేక పంటలు ఎండిపోయిన రైతులకు ధైర్యం చెప్పే సోయి మంత్రులు, ఎమ్మెల్యేలకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కారును ఇంకా ఎన్ని రోజులు భరించాలని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు రైతులు ధైర్యంగా ఉన్నారని, రైతు బంధుతో పెట్టుబడి, పండిన పంటకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకున్నారని తెలిపారు. అరు గ్యారెంటీలు, మార్పు అంటే ప్రజలు మోసపోయాయి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చేరే తప్ప వేరేది కాదని అన్నారు. ప్రజలను చైతన్యం చేసుకుంటూ వారికి ధైర్యం చెబుతూ ముందుకు సాగాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు కంచర్ల కృష్ణారెడ్డి, చకిలం అనిల్‌కుమార్, కటికం సత్తయ్యగౌడ్, మాజీ ఎంపీపీ కరీం పాష ప్రసంగించారు. ఈ సమావేశంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాలె శరణ్యారెడ్డి, వంగాల సహదేవ్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్లు, కొండూరు సత్యనారాయణ, నారబోయిన భిక్షం, తండు సైదులుగౌడ్, నిరంజన్ వలీ, అభిమన్యుశ్రీనివాస్, జమాల్ ఖాద్రి, దేప వెంకట్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, కొప్పోలు విమలమ్మ, కొండ్రు స్వరూపా, జయప్రద, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు

ప్రజలకు గులాబీ జెండానే దిక్కూచి

కాంగ్రెస్ పాలనలో ప్రజల జీవితాలు అస్తవ్యస్థంగా మారాయి. కాంగ్రెస్‌కు ఎందుకు ఓట్లు వేశామని బాధపడుతున్నారు. అరు గ్యారెంటీలు, మోసపు వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు ఏం కోల్పోయారో ఇప్పుడు వారికి అర్థమవుతున్నది. మాకు గులాబీ జెండానే దిక్కూచి అని, కేసీఆర్ అండ అనే స్థాయికి వచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రామాలు, వార్డుల వారీగా ప్రజలు తరలిరావాలి. వార్డు, గ్రామ కమిటీలే ఏర్పాటు చేసుకుంటూ సభ్యత్వాలు నమోదు చేయాలి. పార్టీని బలోపేతం చేసి స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి. నల్లగొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ గూండాలు, కోమటిరెడ్డి అనుచరులకు భయపడేది లేదు.

-కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే

పార్టీ పూర్వ వైభవం కోసం కృషి చేయాలి

నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అడ్డ. వచ్చే స్థానిక ఎన్నికలలోపు పార్టీని మరింత బలోపేతం చేయాలి. రజతోత్సవ సభతోపాటు కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలి. స్థానికంగా వస్తున్న సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేయాలి. కాంగ్రెస్ చేసిన మోసపు హామీలను ప్రజలకు వివరించాలి. అధికారంలో లేనప్పుడే 20లక్షల మందితో సభ పెట్టిన ఘనత బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు ఉన్నది. 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలి.

-బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్

తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష

టీఆర్ఎస్ అనేక ఉద్యమాలు, సభలు పెట్టి పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది. ప్రజల ఆశీర్వాదంతో రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అన్ని రంగాలను దేశంలోనే అగ్రభాగంలో నిలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. కానీ కాంగ్రెస్ పదహారు నెలల్లోనే తెలంగాణను కుదేలు చేసింది. వ్యవసాయ రంగం అస్తవ్యస్తమైంది. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలో ఇంత దారుణంగా ప్రజలను వంచించిన ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడా లేదు. కాంగ్రెస్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ముందుకు సాగాలి. ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి.

- ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్సీ

మాజీ సర్పంచ్‌ల బిల్లులు ఇంకెప్పుడిస్తరు..?

- హామీలు ఇచ్చినా మాట నిలబెట్టుకోని కాంగ్రెస్
- అప్పులు తెచ్చి ప్రగతి పనులు చేసిన వైనం
- పెరిగిపోతున్న వడ్డీలు.. ఆర్థికంగా ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో రూ.వంద కోట్లకు పైగా బకాయిలు
- పోరుబాట పడుతున్న మాజీ సర్పంచ్‌లు

బకాయిలు చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీల ద్వారా చేపట్టిన వివిధ రకాల పనుల బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు సతమతమవుతున్నారు. పదవీ కాలం ముగిసినా బిల్లులు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి వస్తే బిల్లులు చెల్లిస్తామన్న కాంగ్రెస్ హామీ బుట్ట దాఖలైంది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అవుతున్న పైసా చెల్లించకుండా జాప్యం చేస్తున్నది. మరోవైపు సర్పంచ్‌లు తెచ్చిన అప్పులకు వడ్డీలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దీంతో చేసేదేంలేక వారు పోరుబాట పట్టారు.

ఉమ్మడి నల్లగొండలో 1740 గ్రామ పంచాయతీలకుగానూ యాదాద్రి భువనగిరి జిల్లాలో 421, నల్లగొండలో 844, సూర్యాపేటలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయి. గ్రామాల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడతారు. గ్రామాల్లో కొనుగోలు చేసిన మురికి కాల్వలు, వీధిలైట్లు, పైపు లైన్ల లీకేజీలు, రోడ్ల శుభ్రత, పల్లె ప్రగతి, డంపింగ్ యార్డ్‌లు, వైకుంఠ ధామాలు, క్రీడా మైదానాలు, పంచాయతీ భవనాలు తదితర పనులను సర్పంచ్‌లు సొంత డబ్బులతో చేపట్టారు. కానీ ఇప్పటి వరకు బిల్లులకు మోక్షం లభించడం లేదు. బిల్లులు వచ్చే సమయంలోనే అధికారం మార్పిడి జరిగింది.

రూ.100 కోట్లకు పైగా బకాయిలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ. 100 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో రూ. 50 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సర్పంచ్‌లు చెప్తున్నారు.



హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఆందోళన చేపడుతున్న మాజీ సర్పంచ్‌లు (ఫైల్)

ఎస్ఎఫ్‌సీతో పాటు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం కింద కూడా భారీగా బిల్లులు పెండింగ్‌లో మూలుగుతున్నాయి. ఒక్కో మండలం నుంచి కోటి నుంచి రెండు కోట్ల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం, మంత్రులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పైసా ఇవ్వడం లేదు.

అప్పులకు పెరుగుతున్న వడ్డీలు..

వివిధ అభివృద్ధి పనులకు అధిక శాతం మంది మాజీ సర్పంచ్‌లు అప్పు చేసి ఖర్చు చేశారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా సర్పంచులకు కోట్లలో బకాయిలు రావాల్సి ఉన్నట్లు సమాచారం. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో సర్పంచులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్థికంగా కుంగిపోయిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటనలు ఉన్నాయి.

మాట మీద నిలబడని కాంగ్రెస్ సర్కార్..

అధికారంలోకి వస్తే సర్పంచ్‌ల బిల్లులు వెంటనే చెల్లిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. పెద్దఎత్తున ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతలు, ప్రభుత్వం ముఖం చాటేసింది. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన మాజీ సర్పంచ్‌లు చేసేదేం లేక డిసెంబర్ లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం మార్చి 31వ తేదీలోగా ఒక్క పైసా లేకుండా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో మాజీ సర్పంచ్‌లు ఆందోళనలు విరమించుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఏప్రిల్ సగం గడిచినా ఇప్పటి వరకు వరకు ఒక్క పైసా చెల్లించలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకొని బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

బిల్లులు విడుదల చేయాలి..

రాజాపేట మండలంలోని జాల గ్రామ పంచాయితీలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రూ. 14 లక్షలకు పైగా రావాలి. పనులు చేసిన వెంటనే నిధులివ్వాలి. పదవీ కాలం ముగిసినా బకాయిల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం మాట ఇచ్చి తప్పింది. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. సర్కార్ స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలి.

– గుంటి మధుసూదన్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

యాదగిరిగుట్ట : వంగపల్లిలో వాల్ పెయింటింగ్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

'చలో వరంగల్'ను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కనే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం గోడలకు 'చలో వరంగల్' 'జై కేసీఆర్', 'జైజై బీఆర్ఎస్' అంటూ పెయింటింగ్ రాస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనివినీ ఎరుగని రీతిలో రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు. ఊరూరా బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, మాజీ ప్రజాప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రేపాక స్వామి, మాజీ వార్డు సభ్యుడు బొట్టు రాజుగౌడ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

సభకు ఊరూవాడా తరలి రావాలి

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 13 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు దేవరకొండ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు. అంగడిపేట స్టేజీ వద్ద గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని రకాలుగా బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, నాయకులు సుధాకర్, కర్నాటి రవికుమార్ మహేందర్, దామోదర్, రాయినబోయిన శ్రీనివాస్, అర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి పాల్గొన్నారు.



తుంగతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

పదేండ్ల పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

తుంగతుర్తి, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ పదేండ్ల ప్రభుత్వ పాలనలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించామని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు గౌడ్, కల్లెట్ల పల్లి ఉప్పలయ్య, గోపాల్‌రెడ్డి, గాజుల యాదగిరి, సత్యనారాయణ, మట్టిపల్లి వెంకట్, బొంకురి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

శాలిగౌరారం మార్కెట్ యార్డ్‌లో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

వడగండ్ల బీభత్సం

శాలిగౌరారం/నకిరేకల్/చివ్వెంల/సూర్యాపేట టౌన్/తిరుమలగిరి/అర్వపల్లి/మోటకొండూర్ ఏప్రిల్ 13 : ఉమ్మడి జిల్లాలో ఆదివారం సాయంత్రం పలుచోట్ల వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. మామిడి కాయలు నేలరాలాయి. చేతికొచ్చిన వరి పంటలకు నష్టం కలిగింది. నకిరేకల్, శాలిగౌరారం, చివ్వెంల, సూర్యాపేట, తిరుమలగిరి, అర్వపల్లి, మోటకొండూరు తదితర మండలాల్లో కురిసిన వడగండ్ల వర్షం ప్రజలు, రైతులకు తీవ్ర నష్టం కలిగించింది.

మోటకొండూర్ మండలంలోని చామాపూర్‌లో కురుస్తున్న రాళ్ల వాన